చెంగప్ప

గంటి రామలింగం

"ముసలాయన నిన్ను రమ్మన్నాడు...."

బయట ఎండలోకి చూస్తూ నుంచుని ఉన్న రావు ఈ మాటలు విని ఇంచుమించు ఉలిక్కి పడ్డాడు. ఇటు తిరిగి సమాధానం ఇవ్వబోయాడు. గదిలో దీపాలు వేసి ఉన్నప్పటికీ వెలుగు తీవ్రతలో మార్పు రావటంతో కళ్లు చీకట్లు కమ్మినట్లయింది. తనతో మాట్లాడిన అతను అప్పటికే వెళ్ళిపోతున్నాడు. "చిదంబరం!" అని అతన్ని పిలువబోయాడు. మాట పెగలలేదు. ఒకళ్ళిద్దరు టయిపు చేసుకుంటున్నారు. ఇంకొక వ్యక్తి కలం చేతిలో పట్టుకుని తన వయిపే శూన్యంగా చూస్తున్నాడు. మిగిలిన కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.

రావు చేతిమీది గడియారంలో ఇంకా రెండు గంటలు కాలేదు. "ముసలాయన" సాధారణంగా తనని ఈ వేళలలో పిలవడు. ప్రత్యేకంగా ఏదయినా కారణం ఉందేమో ఇప్పుడు రమ్మనటానికి, అనుకుంటూ అతను లిఫ్ట్ వయిపుకి నడిచాడు.



"ఏమిటి సార్ ఇవాళ ఇంత త్వరగా పయికి వెడుతున్నారు?" అని పలకరించాడు. లిఫ్ట్ నడిపే దీక్షితులు. రావు రోజూ రెండున్నర తరువాతనే 'ముసలాయన'ని చూడటానికి వెడతాడని దీక్షితులికి తెలుసు.

"అవును దీక్షితులూ, అయ్యగారు ఇవాళ కునుకు తీస్తున్నట్లు లేరు." అన్నాడు రావు. లిఫ్ట్ తలుపులు మూసుకుంటూ ఉండే, దానిలోపల ఉక్కగా ఉంది. వేడెక్కిన నూనెవాసన వాళ్ళ తలమీద తిరిగే ఫాన్‌వల్ల మరింత ఎక్కువ అయినట్లు అనిపించింది అతనికి.

"మీ ఫ్లోర్ వచ్చేసింది సార్..." అని దీక్షితులు అనటంతో రావు ఆలోచనలోనుంచి తేరుకున్నాడు.

టేకు రంగు తలుపుమీద "మేనేజింగ్ డయిరెక్టర్" అన్న ఇంగ్లీషు అక్షరాల మీద ఉన్న పేరు తీసివేసి 'ముసలాయన' అని ఇంగ్లీషులోనే రాస్తే ఎలాగ ఉంటుందో, అనుకున్నాడు తను చాలా సార్లే. దీనిని గురించి చెప్పుకుని నవ్వుకున్నారు కూడా తనతో పనిచేసేవారు. మేనేజింగ్ డయిరెక్టర్ అసలు గదిలోకి వెళ్ళాలంటే ముందు ఒక చిన్నదానిని దాటాలి. ఆ చిన్నగదిలోనే తను కూర్చుంటాడు. 'ముసలాయన' గది తలుపుకి ఉన్న చిన్న కిటికీలోనుంచి తొంగి

చూశాడు. ఆయనతో వేరే ఎవరూ లేరు. లోపల చాలా చల్లగా ఉంది. "ఎయిర్ కండిషనర్ ఉంటే మాత్రం వణుకు పుట్టే అంత చల్లగా పెట్టుకోవాలా ? అని ఎవరయినా అంటే 'ముసలాయన' పళ్లు కనపడేట్లు చిరునవ్వు నవ్వేవాడు.

"పిలిచారుట..." రావు బల్లకి ఇవతల పక్క నుంచుని తనలో తను మాట్లాడుకున్నంత నెమ్మదిగా అడిగాడు. 'ముసలాయన' సమాధానం చెప్పకుండా ఏవో కాగితాలు చదువుకుంటూ ఉండిపోయాడు. అతను బాగా ఎర్రటి మనిషి; మొహం అంతా సన్నటి ముడతలు; జుట్టు తెల్లగా నెరిసిపోయి ఉండేది.

కొన్ని క్షణాలపాటు ఇద్దరూ మాట్లాడలేదు. రావు తన ప్రశ్నని మళ్లీ వెయ్యబోయి ఊరుకున్నాడు. చివరకి 'ముసలాయ'నే తల ఎత్తి చూశాడు. అతని కళ్ళు రావుకి ఎప్పుడూ నీరు కారుతున్నట్లు కనిపించేవి. ఇంకా కొన్ని క్షణాలు గడిచాయి.

"చెంగప్ప సరే నన్నాడా ?" ఈ సారి ముసలాయనే మాట్లాడాడు.

రావుకి ఒళ్ళు ఝల్లుమన్నట్లయింది. అతను వెంటనే సమాధానం ఇవ్వక పోయేటప్పటికి 'ముసలాయన' ప్రశ్నార్థకంగా కనుబొమ్మలు కొంచెంగా పయికి ఎత్తి చూశాడు.

"సరే అనక ఏమి చెయ్యగలడు ?" అని గొణుగుకుంటున్నట్లు జవాబు చెప్పాడు రావు. ఎలాగో ధైర్యంచేసి ముసలాయన ముఖంలోకి చూశాడు. అతని పళ్ళు తెల్లగా మెరుస్తున్నాయి. నవ్వుతున్నట్లు పెదిమల్ని విడమరచి ఉంచటం అతనికి అలవాటే కాని నవ్వు వెనుక హాస్యం అనేది ఏమీ లేదని రావుకి బాగా తెలుసు. ముసలాయన బల్లమీది పెన్సిల్ని ఒకదానిని తీసి దానితో నెమ్మదిగా తనముందు పయి పళ్ళ వరుసమీద కొట్టుకోవటం ప్రారంభించాడు. కట్టుడు పళ్లు కాబట్టే అంత సమంగా చక్కగా ఉన్నాయి, అన్న ఆలోచన రావు మనస్సులో మెదిలి మాయం అయింది.

"సాయంత్రంలోపల మళ్ళీ కలుసుకుని పని పూర్తి చేసేస్తాను..."

"సరే, మూడు గంటల లోపల మనం మీటింగ్‌కి వెళ్ళాలి కదా ! తర్వాత వెళ్ళు చెంగప్ప దగ్గరికి." అన్నాడు ముసలాయన తన ముందు ఉన్న కాగితాలని సర్దుతూ.

"అరగంటలో సిద్ధంగా ఉంటాను" అని రావు ఆ గదిలోనుంచి బయట పడ్డాడు. తన కుర్చీలో కాస్సేపు కూర్చుందా మనుకున్నాడు. ముందు కాంటీన్‌కి టెలిఫోన్‌చేసి ఏదయినా తెప్పించుకోవచ్చు కాని కిందికి వెడితేనే బాగా ఉంటుందని మళ్ళీ అనిపించింది. కొంత సేపటిదాకా ముసలాయనకి దూరంగా ఉంచే మంచిదనుకున్నాడు.

బయట కారిడార్‌లో అప్పుడేవచ్చి కుర్చీలో కూర్చోబోతున్న ఎటెండరు నేరుగా నుంచుని "ఇందాకటినుంచి మీకోసం అడుగుతున్నారు ఆయన..." అన్నాడు.

రావు అవునన్నట్లు తలాడించి లిఫ్ట్ వయిపుకి నడిచి వెళ్లిపోయాడు. లిఫ్ట్ ఆపరేటర్ "కాంటీన్‌కేకదా ?" అన్న ప్రశ్నకి కూడా మాటలలో సమాధానం చెప్పకుండా తల పంకించాడు.

కాంటీన్‌లో బాగా ఖాళీగా ఉన్న చోటు చూసుకుని అక్కడికి తీసుకు వెళ్ళాడు తన కాఫీని. తనలాంటి వాళ్ళకోసం కొంచెం ఎక్కువ శ్రద్ధగా చేసినప్పటికీ కాఫీ తియ్యగా కొద్దిగా మందువాసన ఏదో వేస్తోంది. ఇక్కడినుంచి చెంగప్పకి ఫోన్‌చేసి మాట్లాడవచ్చు. ఇంతలో ముసలాయన చెయ్యకుండా ఉండాలి, అంతే. అతనికి ఇది సాధారణంగా ఒక చిన్న కునుకు తీసే వేళ. కాని ఏమిచేస్తాడో చెప్పటం కష్టం అనుకున్నాడు రావు. తాగుతున్న కాఫీని మధ్యలోనే వదిలివేసి ఫోన్ దగ్గరికి వెళ్ళాడు. కాంటీన్ అధికారి అతని ఉద్దేశాన్ని కనిపెట్టి తనవద్ద టెలిఫోన్‌ని కొంచెం ముందుకి తోశాడు.

చెంగప్ప దొరకలేదు. 'ఫరవాలేదు' అనుకున్నాడు రావు. టెలిఫోను చేసినందుకు డబ్బులు ఏమీ పుచ్చుకోలేదు కాంటీన్ మనిషి. కొంచెంసేపు ఆగి, తన గదిలోనుంచి టెలిఫోనుచేసి చూడవచ్చుననుకుంటూ రావు తిరిగి వెళ్ళిపోయాడు. మనసులో వ్యాకులం మాత్రం వాన ముసురులాగ అలుముకునే ఉంది. రావుని చూడగానే అటెండరు "మీకోసం అడుగుతున్నారు అయ్యగారు..." అన్నాడు.

"పది నిముషాలు ముందే బయలుదేరుదాము. డ్రయివరుతో చెప్పు !" రావు గదిలోకి వెళ్ళేప్పటికి నుంచునే ఉన్నాడు ముసలాయన. నిద్రపోలేదన్న మాట. 'మేలుకునే ఉండి ఏమి చేశాడో...' రావు ఆందోళన ఎక్కువ అయింది.

"అలాగే," అంటూ కిందకి ఇంటర్ కామ్‌లో చెప్పటానికి ఉద్యుక్తుడయ్యాడు.

*   *   *

కారులోకూడా ఎయిర్ కండిషన్ ఉంది. కిటికీల అద్దాలన్నీ కొద్దిగా రంగువి కావటంచేత లోపల అసలే ఎండ తెలియటంలేదు. బస్సుల చప్పుళ్ళూ, వాహనాల హారన్‌లూ సన్నగా వినపడుతున్నాయి. రావు డ్రయివరు పక్కన కూర్చుంటే ముసలాయన ఒక్కడూ వెనక సీటులో డ్రయివరు వెనక కూర్చున్నాడు.

"ట్రాఫిక్ ఎక్కువగానే వుంది." అన్నాడు రావు కొంచెంగా వెనక్కి తిరిగి. ముసలాయన ముభావంగా అతని వయిపు చూసి "అవును" అన్నాడు.

నడుస్తున్న కారు హటాత్తుగా ఒక కుదుపుతో ఆగిపోయింది. ముందు బస్సువాడు 'సడన్ బ్రేక్' వేశాడని నసిగాడు డ్రయివరు. ఆ బస్సు దట్టంగా పొగ వదులుతోంది. ఎలాగయినా దానిని దాటివెళ్ళమని డ్రయివరుతో రావు అన్నాడు.

"కష్టం ! ఈ వయిపు ఎదురుగా చాలా బళ్లు వస్తున్నాయి. ముసలాయన అన్న ఈమాటలువిని రావు అతనివంక చూశాడు. ముసలాయన తనచేతిగడియారం చూసుకుంటున్నాడు "మన మీటింగ్‌కి వెళ్లేముందు క్లబ్బులో ఒక నిముషం ఆగాలి.

"క్లబ్బులోనా ?" అనాలోచితంగా అడిగాడు రావు. అతని ఈ ప్రశ్నకి సమాధానం రాలేదు. ఏమి మాట్లాడాలో తెలియక రావు తన దృష్టిని ముందుకి మళ్ళించాడు. "చెంగప్పగారు క్లబ్బులో ఉంటారు సార్..." అని చాలా నెమ్మదిగా రహస్యం చెప్పినట్లు చెప్పాడు డ్రయివరు. అతని మాటలు వెనుక సీటులో వినపడి ఉండవు అనుకున్నాడు రావు. ఈ ఆలోచన వస్తూ వుండగానే అతని కలవరపాటు మరింత ఎక్కువయింది.

వాళ్ళ కారు వెనకాల వాహనాల హారన్‌లు ఒక్కసారిగా మోగటం మొదలు పెట్టాయి. డ్రయివరు అస్పష్టంగా ఏదో అంటూ బస్సుని తప్పించి ముందుకి వెళ్ళటానికి అతిప్రయాసతో స్టీరింగ్ వీల్‌ని తిప్పటంచూసి "జాగ్రత్త..." అని మందలించాడు రావు. కారు ఎడమవయిపున కూర్చుని ఉన్న అతనికి అవతల వయిపు బళ్ళు రావటం అంత బాగా కనపడటంలేదు. డ్రయివరు తమ కారు హారన్‌ని అదేపనిగా వేస్తూముందుకి వెళ్ళిపోతున్నాడు. బస్సు ఎందుకి ఆగిపోయిందో అప్పుడు తెలిసింది రావుకి. దాని ముందు ఒక లారీ నిలబడి వుంది. దాని తాలూకు మనిషి బస్సు డ్రయివరుతో చేతులు ఊపుతూ ఏదో చెబుతున్నాడు. రావు ఆ దృశ్యాన్ని ఒక్క క్షణం చూసి ముందుకి దృష్టి సారించాడు. ఎదురుగుండా ఇంకొక లారీ వస్తోంది. అది ముందుకి వచ్చేలోపలే లారీని కూడా దాటి వెళ్ళిపోవటానికి వేగం హెచ్చించాడు తమ డ్రయివరు. వెనక సీటునుంచి ముసలాయనా, ముందునుంచి రావూ కంగారుగా హెచ్చరికలు చేశారు. డ్రయివరు ప్రయత్నం ఫలించలేదు. లారీ, కారూ-రెండింటి బ్రేకులు కూడా పడ్డాయి కాని ప్రయోజనం లేకపోయింది. చెంగప్ప సంగతి ఏమిటి ? అన్న ఆలోచన మెరిసినట్లయింది రావుకి. ఇంచుమించు అదే క్షణం వాహనాలు రెండూ ఢీ కొన్నాయి.

రావు తను ఒక ఆసుపత్రి మంచంమీద పడుకుని ఉన్నానని గ్రహించాడు. నెమ్మదిగా చేతులు కదిలించి చూశాడు. ఆ తర్వాత కాళ్ళు కొంచెం మడిచి నేరుగా చాపుకున్నాడు. ఎముకలు ఏవీ విరిగినట్లు లేవు. సందేహిస్తూనే తల తడిమి చూసుకున్నాడు. కట్టు కట్టి ఉంది.

"తెలివి వచ్చిందన్న మాట!

మంచిది..." అప్పుడే తలుపు తెరిచి లోపలికి వస్తున్న అతను అన్నాడు. అద్దాలకి ఫ్రేములేని కళ్ళజోడు, మోకాళ్ళదాకా వచ్చే తెల్లకోటు వేసుకుని పొట్టిగా ఉన్నాడు. బట్టతల నున్నగా మెరుస్తోంది. డాక్టరు వెనకే వచ్చిన వ్యక్తి ముఖం రావుకి బాగా పరిచితమయినదే.

"మిమ్మల్ని తీసుకు వెళ్ళటానికి ఈయన వచ్చారు. మీ ఆఫీసు వాళ్ళు పంపారు..." అని చెప్పుకుపోతూ డాక్టరు మంచం దగ్గరికి వచ్చి రావుని పరీక్షించటం ప్రారంభించాడు." ఎముకలేవీ విరగలేదు. తలకి చిన్న దెబ్బతగిలిందంతే—కారు విండ్ స్క్రీన్ కొట్టుకొని స్పృహ తప్పింది. అదృష్టవశాత్తు ఇంకేమీ కాలేదు..."

రావు చూపులు డాక్టరుని దాటి వెనుక నుంచుని ఉన్న వ్యక్తి మొహంమీద నిలిచాయి, అతను పెదవి విరిచి తల కొద్దిగా, అడ్డంగా ఆడించాడు.

"మీరు లేచి నుంచోవచ్చు. కావలిస్తే వెళ్ళిపోవచ్చుకూడా... డ్రయివరుకి కూడా...పెద్ద దెబ్బలేమీ తగలలేదు. కాని మీ మేనేజింగ్ డయిరెక్టరు మాత్రం..." అని ఆగిపోయాడు డాక్టరు.

లారీకి అంత గట్టిగా కొట్టుకోలేదు కారు. ముసలాయన గుండె ఆగిపోయాడుట...!" ఈ మాటలు అంటున్నప్పుడు రావు తోటి ఉద్యోగి ముఖ కవళికలు మారలేదు.

* * *

ఇంటి ఆవరణలో జనం గుమిగూడి ఉన్నారు. కార్లు వచ్చి వెడుతున్నాయి. రావు ముందు ముసలాయన ఇంటికే వెళ్ళాలన్నాడు. అతన్ని తీసుకురావటానికి వచ్చిన వ్యక్తి అభ్యంతరం చెప్పలేదు. నడిచినప్పుడు తల కొంచెం తిరుగుతున్నట్లు అనిపించింది. కాని రావు ఎవరి చేయూతా లేకుండానే కారు ఎక్కి దిగ గలిగాడు. దారిలో యిద్దరూ పిచ్చపాటీ కొంచెం మాట్లాడుకున్నారు.

"ముసలాయన తమ్ముడే వస్తాడనుకుంటున్నారు..." రావుని తీసుకు వెడుతున్న అతను అన్నాడు. హాల్లోకి వెళ్ళమని ఎవరో చెబితే ఇంటివయిపు నడిచారు ఇద్దరూ.

"అదుగో చెంగప్ప వెళ్ళిపోతున్నాడు!" రావు అటు చూశాడు. నల్ల రంగు కిటికీ అద్దాలు ఉన్న కారు ఒకటి పోర్టికోలోనుంచి బయటికి వస్తోంది. ముందు గాజు కిటికీమీద వెల్తురుపడి మెరుస్తోంది. కాని లోపల డ్రయివరు మాత్రం అస్పష్టంగా కనిపిస్తున్నాడు. వెనక సీటులో వున్నవాళ్లు అసలే కనిపించటంలేదు.

తనతో వస్తున్న వ్యక్తి మలుపు తిరిగి, "అది చెంగప్ప కారని కూడా నాకు తెలీదు." అన్నాడు రావు. "లోపల మనుష్యులే కనిపించలేదు!"

"చెంగప్ప కారు, అంటే చెంగప్ప ఎక్కి వెడుతున్న కారు అని మాత్రమే అర్థం..." అని చిరునవ్వుతో సమాధానం చెబుతూ అతను తనని పలకరించిన వారితో ఎవరితోనో మాట్లాడటానికి కొంచెం పక్కకి వెళ్ళాడు.

"త్వరగా వెడదాము. ఇంకొంచెంసేపటిలో బయలుదేరుతారుట..." వెళ్ళిన వాడు మళ్ళీ రావు దగ్గిరికి వచ్చేశాడు.

హాలులో అగరవత్తుల పొగతో పువ్వుల వాసనలు కలిసిపోయి ఉన్నాయి. శవాన్ని గదిమధ్యలో పడుకోబెట్టారు. ముసలాయన భార్య పక్కనే కూర్చుని ఉంది. తల వంచుకుని ఉండటంచేత వెక్కిళ్ళతో కదిలే వంటినిబట్టి ఆమె ఏడుస్తోందని గ్రహించాడు రావు. ఆమె పక్కన మూగిఉన్న ఆడవారు ఏదో చెవుతున్నారు. రావు రాకని గమనించిన ఒకావిడ వంగి వృద్ధురాలి చెవిలో ఏదో చెప్పింది. ఆవిడ తలఎత్తి రావు వయిపు చూసింది. ఉబ్బిపోయి ఉన్న మొహం మీద కన్నీటి చారలు కట్టి ఉన్నాయి. రావు నమస్కారం పెట్టాడు. కాని ఆమె చూపులో గుర్తింపు ఏదీ కనపడలేదు. కొన్ని క్షణాలు అక్కడే నుంచుని రావు వరండాలోకి వచ్చేశాడు.

"మీకూ దెబ్బ తగిలి ఆసుపత్రిలో ఉండిపోయారు కాని లేకపోతే ఈ పని అంతా మీకే తగిలేది!" వరండాలో అతనితో మాట్లాడటానికి చుట్టూ చేరిన వారిలో ఒకరు అన్నారు.

"ఇప్పుడయినా ఏమి చెయ్యాలో తోచటం లేదు..." అన్నాడు రావు ఆ వ్యక్తితో.

"ముసలాయన తమ్ముడు రాగానే అంతా తెలుస్తుందిలెండి!" ఈ సమాధానం రావులో సన్నటి కలవరాన్ని లేవదీసింది. చెంగప్పని 'తమ్ముడు' కలుసుకుంటే...

"కారులో బయలుదేరాడుట. ఈపాటికి ఇక్కడికి వచ్చేసి ఉండాలి." రావుతో మాట్లాడుతున్న ఆయన రిస్టువాచి చూసుకుంటూ అన్నాడు.

'ఇంతలో తను వెళ్ళి చెంగప్పని కలుసుకోవచ్చు" అనుకున్నాడు రావు. ఇంట్లో ఎక్కడో టెలిఫోను మోగింది. దానిని తియ్యటానికి వెళ్ళిన మనిషి కాబోలు వచ్చి రావుతో అన్నాడు "చిన్న అయ్యగారు మీకోసం ఫోన్ చేశారు. మిమ్మల్ని వెంటనే ఆఫీసుకి రమ్మన్నారు!"

"ఇక్కడికి రాకుండా ఆఫీసుకే ముందు వెళ్ళారన్నమాట తమ్ముడుగారు..." అంతకిముందు రావుగారితో మాట్లాడిన వ్యక్తి అన్నాడు.

రావులో ఆందోళన బాగా ఎక్కువ అయిపోయింది. ఎవరికీ ఏమీ చెప్పకుండా టెలిఫోన్ దగ్గిరికి వేగంగా నడిచి వెళ్ళిపోయాడు.

"చెంగప్పగారు లేరండీ! మీ మేనేజింగ్ డయిరెక్టర్ ఆఫీసుకే వెళ్ళారు..."

రావు టెలిఫోన్ రిసీవరుని పెట్టేసి నెమ్మదిగా బయటికి నడిచి వెళ్ళాడు. □

కవి వారసత్వం

నిఖిలేశ్వర్

కవితాక్షరాల
నిర్వీకృతమైన అనంతశక్తి
ధనానికేం తెలుసు?
పాలకుల దురాత్మలకేం తెలుసు?
అహంభావంతో షిరిడీగేక విత్వం
విలువలు పలువలుగా—
కథలల్లే కబుర్లరాయుళ్లకే అంకితం!
తానుతప్ప ప్రపంచమంతా
పొట్టిపోయిందనే
ధూర్త ప్రేలాపనలకేం తెలుసు—
ప్రతి మహోన్నతమైన కవికిపూర్వం
మరికొందరు వుండనేవున్నారు
ఆతర్వాత వచ్చేతరాల వెంబడి
ఇంకెందరో పుడుతూనే వుంటారు!